క్లుప్తంగా

నేడు బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు రెడ్డి వీధి రామాలయం వద్ద శనివారం సాయంత్రం 5 గంటలకు వార్డు స్థాయి 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమం ప్రారంభమవుతుందని వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాద రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ పాల్గొంటారన్నా రు. వార్డు కమిటీ సభ్యులు, అనుబంధ విభా గాల అధ్యక్షులు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

జీవీఎంసీ పాఠశాలకు మూడు ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లు అందిస్తున్న బౌద్ధ మత ప్రచారకుడు ధర్మానంద

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు మూడు సీలింగ్ ఫ్యాన్లను శుక్రవారం బౌద్ధ మత ప్రచారకుడు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారికి అందించారు. ధర్మానంద మాట్లాడుతూ బుద్ధుడు బోధించిన నైతిక విలువులను విద్యార్థులు పాటించడం వల్ల ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లి పాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న బాలింతలు, నర్సింగ్ విద్యార్థులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తల్లిపాల వల్ల పిల్లలకు కలిగే లాభాల గురించి బాలింతలకు వివరించారు. బెహరా నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అనూషా ప్రియ మాట్లాడుతూ తల్లి పాలు పిల్లలకు అమృతంలా పని చేస్తాయని చెప్పారు. పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెంచడంతో పాటు పోషకాలు అందిస్తాయని వివరించారు.తల్లి పాల వారోత్సవాలు 1 నుంచి 7వ తేదీ వరకు జరుపుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ. దేవి, టి.శాంతి, బి. గాయత్రి, ఆర్.చంద్రకళ, కె.సంతోషి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా రమేష్

విశాఖ విద్య: బీజేపీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దాడి రమేష్ శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. జిల్లా పార్టీ నాయకత్వంలో కీలక పదవి అప్పగించడంతో పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకులకు ఈ సందర్భంగా రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు తదితరులు పాల్గొన్నారు.

కుట్రపూరితంగా కాంట్రాక్టు కార్మికుల తొలగింపు

- ధ్వజమెత్తిన సీఐటీయూ నాయకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఐదు వేలమంది కాంట్రాక్టు కార్మికులను ప్లాంట్ యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపూరితంగా తొలగించాయని విశాఖ పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ (సీఐటీయూ) నాయకులు పేర్కొన్నారు. ఈ కుట్రలో స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ భాగస్వాములయ్యారని ఆరోపించారు. కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలనే డిమాండ్‌తో పోరుబాట నిర్వహించనున్నట్టు కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు తెలిపారు. గాజువాక సీఐటీయూ కార్యాలయంలో పోరుబాట పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలగించిన ఐదువేలమంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, స్థానిక ఎంపీ జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. నిర్వాసితులందరికీ ఉపాధి కల్పించాలని, తొలగించినవారి స్థానంలో కొత్తవారిని నియమించరాదని అన్నారు. బయో మెట్రిక్‌లో ఆధార్ లింక్ ఎత్తివేసి అందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.రాంబాబు, డి.రమణ, ఎన్. రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యావనరుల కేంద్రం.. సమస్యల నిలయం

- ఎంఈవో-1కు డిప్యూటీ డీఈవోగా అదనపు బాధ్యతలు
- ఎంఈవో-2 పైనే భారమంతా
- కంప్యూటర్ ఆపరేటర్లుగా క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు
- పాఠశాలలపై పర్యవేక్షణ శూన్యం



ఎంఈవో కార్యాలయం



జ్యోతినగర్ పాఠశాల



కంప్యూటర్ ఆపరేటర్లుగా సీఆర్పీలు

విశాఖ విద్య: గోపాలపట్నం మండల విద్యావనరుల కేంద్రం (ఎమ్మార్సీ) సమస్యలకు నిలయంగా మారింది. విద్యాశాఖ కార్యకలాపాలకు కేంద్ర బిందువైన ఈ కేంద్రాన్ని మర్రిపాలెం జ్యోతినగర్ జీవీఎంసీ పాఠశాలలో ఏర్పాటు చేశారు. మండలంలో ఓ మూలకు విసిరేసినట్లుగా ఉండడంతో ఇది దూరాభారమైంది. కీలకమైన ఎంఈవో-1 గా పనిచేస్తున్న అంబటి సోమేశ్వరరావు డిప్యూటీ డీఈవోగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో మండలంలోపాఠశాల పర్యవేక్షణ కరువైంది.

ఇదీ పరిస్థితి

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 38 పాఠశాలల ఉండగా వీటిలో సుమారు 8 వేల మందికి పైగా విద్యనభ్యసిస్తున్నారు. ఎంఈవో-2గా ఉన్న దివాకర్ పైనే మండల విద్యాశాఖ భారమంతా పడుతోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలలపైర్యవేక్షణ కొరవడడంతో మండలంలో విద్యా ప్రమాణాలు తిరోగమణ దిశలో పయనిస్తున్నాయి.

ఎంఈవో ఒక్కరే దిక్కు

డిప్యూటీ డీఈవోగా వ్యవహరిస్తున్న సోమేశ్వరరావు పూర్తిగా జిల్లా కార్యాలయంలోనే ఉండాల్సి వస్తోంది. దీంతో ఎంఈవో-2 ఒక్కరే మండల విద్యావనరుల కేంద్రంలో మిగిలారు. గోపాలపట్నం మండలం కొత్తగా ఏర్పాటు కావడంతో ఎమ్మార్సీకి సిబ్బంది కేటాయించలేదు. కార్యాలయం ఊడ్చేందుకు కూడా ఎవరూ లేని పరిస్థితి ఉంది. దీంతో సమీపాన ఉన్న జీవీఎంసీ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలను ఇక్కడ పనులకు వినియోగించుకుంటున్నట్టు తెలుస్తోంది. సర్వీసుపరమైన పనుల కోసం మండలంలో పనిచేసే ఉపాధ్యాయులు ఎమ్మార్సీకి రాకుండా డీఈవో కార్యాలయంలో ఉంటున్న ఎంఈవో-1 సోమేశ్వరరావు వద్దకు వెళ్తున్నారు. దీంతో గోపాలపట్నం మండల ఎమ్మార్సీ బోసిపోయినట్లు కనిపిస్తోంది.

కంప్యూటర్ ఆపరేటర్లుగా సీఆర్పీలు

హైస్కూళ్ల కేంద్రంగా ఏర్పాటైన క్లాంప్లెక్స్ సముదాయాల్లో సేవలు అందించాల్సిన క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్పీ)లకు తప్పనిసరి పరిస్థితుల్లో ఎంఈవో కార్యాలయంలో విధులు కేటాయిస్తున్నారు. ప్రస్తుతం మండల విద్యాశాఖకు సంబంధించి ఏ రోజు నివేదికలను అదే రోజు ఆన్‌లైన్‌లో నివేదించాల్సి ఉంది. ఇందు కోసం కంప్యూటర్ ఆపరేటర్ తప్పనిసరిగా ఉండాలి. ఎంఈవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడంతో సీఆర్పీలను సాయంత్రం వేళల్లో కార్యాలయానికి పిలిపించి నివేదికల ఆన్‌లైన్ పనులు అప్పగిస్తున్నారు. పనివేళలు అయిపోయిన తర్వాత ఇళ్లకు పోనీయకుండా మాకు ఇవేం తిప్పలని సీఆర్పీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న మహిళా సీఆర్పీలు ఈ కారణంగా సకాలంలో ఇళ్లకు చేరలేకపోతున్నారు.



ఎంఈవో కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ప్రైవేటు స్కూళ్ల ఇష్టారాజ్యం

మండలంలో గుర్తింపు పొందిన 103 ప్రైవేటు స్కూళ్ల ఉండగా వీటిలో 33వేలకు పైగా విద్యార్థులు ఉన్నారు. ఎంఈవో-1గా వ్యవహరిస్తున్న సోమేశ్వరరావు మాత్రమే వీటిపై పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ఆయన డీవైఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తుడడంతో మండలానికి రాలేకపోతున్నారు. దీంతో ప్రైవేటు స్కూళ్ల ఇష్టారాజ్యమైంది. ప్రైవేటు పాఠశాలల్లో ఫ్రీ సీటు పొందిన విద్యార్థులతో కూడా ఫీజులు కట్టించుకోవడం, పుస్తకాలు, యూనిఫారాలు స్కూల్లోనే కొనుగోలు చేయించారని తల్లిదండ్రులు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. ఇలాంటి వాటిపై పర్యవేక్షణ చేయలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.

సిబ్బంది కొరత



గోపాలపట్నం మండల విద్యావనరుల కేంద్రానికి సిబ్బంది లేనిమాట వాస్తవమే. కొత్త మండలం కావడంతో శాంక్షన్ పోస్టులు లేవు. వేరే చోట నుంచైనా ఇక్కడ సర్దుబాటు చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రైవేటు పాఠశాలలపై వస్తున్న ఫిర్యాదులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ పెంచుతాం.

– అంబటి సోమేశ్వరరావు, డిప్యూటీ డీఈవో

స్కేటర్లకు ఘన స్వాగతం



విమానాశ్రయంలో క్రీడాకారులకు స్వాగతం పలుకుతున్న అసోసియేషన్ సభ్యులు

గోపాలపట్నం: అంర్జాతీయ స్కేటింగ్‌లో 13 పతకాలు సాధించి విశాఖ వచ్చిన స్కేటింగ్ క్రీడాకారులకు విశాఖ విమానాశ్రయంలో శుక్రవారం స్కేటింగ్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. సౌత్‌కొరియాలో గత నెల 19 నుంచి 29 వరకు జరిగిన 20వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపారని విశాఖ జిల్లా రూరల్ స్పోర్ట్స్‌అసోసియేషన్ అధ్యక్షుడు యార్ల గడ్డ రమేష్ చంద్ర తెలిపారు. ఈ పోటీల్లో క్రీడాకారులు 5 బంగారు, 5 సిల్వర్, మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించారని చెప్పారు. వీరు విశాఖపట్నానికి అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకు వచ్చారని అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శీలం లక్ష్మణ్, కోచ్ పి. సత్యం, కె. గంగాధర్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న దొడ్డి కిరణ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు ఆదర్శనగర్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి డీకే ఫౌండేషన్ ద్వారా వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దొడ్డి కిరణ్ శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఆదర్శనగర్ కోట వీధికి చెందిన సూరిబాబు అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న ఆయన ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం దహన సంస్కారాల కోసం రూ.5000 అందించారు. ఆయనతో పాటు తులసి, పండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అదానీ స్మార్టు మీటర్లు మాకు వద్దు



ర్యాలీలో ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు, కార్యకర్తలు

మల్కాపురం: అదానీ స్మార్టు మీటర్లు మాకు వద్దు అంటూ ప్రజా సంఘాల ఐక్య వేదిక శుక్రవారం మల్కాపురం నుంచి శ్రీహరిపురం వరకు ర్యాలీ నిర్వహించింది. స్మార్టు మీటర్ల అంశంలో కూటమి నాయకుల వైఖరిని తప్పు పడుతూ నినదించారు. సీపీఎం జిల్లా నాయకుడు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ అదానీ మీటర్ల ఏర్పాటు చేస్తే రాష్ట్రంలో ప్రజలపై 26 వేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని ఆరోపించారు .ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల వల్ల వస్తున్న చార్జీలకు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరలా మాకు స్మార్టు మీటర్లు ఎందుకు బాబూ అంటు చంద్రబాబును ఉద్దేశించి అన్నారు. కూటమి నాయకులు స్మార్టు మీటర్ల ఏర్పాటుపై ఇచ్చిన మాట ఏంటి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ట్రూ అప్ చార్జీలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటికి స్మార్టు మీటర్ పట్టుకు వచ్చి బిగిస్తామంటే వారిని తిప్పి పంపాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఐద్వా,సీఐటీయూ,సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

టైం స్కేల్ వర్తింపజేయాలని వినతి

ఎంవీపీ కాలనీ : ఏయూలో 28 రోజులు, కాంట్రాక్ట్, కన్సాలిడేటెడ్ ఉద్యోగులకు టైం స్కేల్ హోదా కల్పించాలని పలువురు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఏయూలోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనమూ కల్పించలేదన్నారు. ప్రభుత్వంతో, ఏయూ వీసీతో చర్చించి అందరికీ టైం స్కేల్ వర్తింపజేసి ఆర్థిక, ఉద్యోగ భరోసా కల్పించాలని కోరారు.

రెండు చోరీ కేసులను ఛేదించిన పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ మోహన్‌రావు, సీఐ మల్లికార్జునరావు

పరవాడ: ఇటీవల పరవాడలో జరిగిన రెండు దొంగతనం కేసులను ఛేదించినట్లు పరవాడ ఇన్‌చార్జి డీఎస్పీ బి.మోహన్‌రావు వెల్లడించారు. ఈ దొంగతనాలకు సంబంధించి ఒకరిని అరెస్టు చేసి, మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.45 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. వెన్నలపాలెం సినిమాహాలు జంక్షన్‌లోని పైల వెంకటరావు నివాస గృహంలో గత నెల 22న పట్టపగలు జరిగిన దొంగతనంలో మూడు తులాల నల్లపూసలు, అర తులం బంగారు రింగులు ఆపహరించారు. అదే గ్రామంలో గత 29న రెడ్డి శివ ఇంట్లో చొరబడి అర తులం బంగారు చెవి దిద్దులు, రూ.60 వేల నగదును దొంగిలించారు. ఈ ఫిర్యాదులపై డీఎస్పీ ఆదేశాల మేరకు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు దర్యాప్తు ప్రారంభించి, రెండు దొంగతనాలకు పాల్పడింది ఒకరేనని తేల్చారు. కంచరపాలెంలో ఉంటున్న సబ్బవరపు కృష్ణంనాయుడు(27) ఈ దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఇతడి స్వస్థలం చోడవరం ఎడ్ల వీధి కాగా, 20 ఏళ్లుగా ఇతని కుటుంబం కంచరపాలెంలో నివసిస్తోంది. నిందితుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసగా మారి, ఈ దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. నిందితుడు ఉపయోగిస్తున్న స్కూటీని స్వాధీనం చేసుకుని, అతన్ని అరెస్టు చేసి అనకాపల్లి కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు. చోరీ కేసుల్ని ఛేదించడంలో కృషి చేసిన పరవాడ డీఎస్పీ, ఇన్‌చార్జ్ డీఎస్పీ, సీఐ తోపాటు, సిబ్బందిని అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు.

అసైన్‌మెంట్ పుస్తకాల పంపిణీ



అసైన్‌మెంట్ పుస్తకాలతో ఎంఈవోలు, ఉపాధ్యాయులు

ఆరిలోవ : చినగదిలి మండలంలో అసైన్‌మెంట్ పుస్తకాలు శుక్రవారం నుంచి పాఠశాలలకు పంపిణీ చేయడం ప్రారంభించారు. మండల కేంద్రం తోటగరువు ఉన్నత పాఠశాలలో సిద్ధమైన ఈ పుస్తకాలను అందుబాటులో ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కేంద్రాన్ని శుక్రవారం ఎంఈవో 1 సీహెచ్.రవీంద్రబాబు, ఎంఈవో 2 పి.అనురాధ సందర్శించారు. వాటి కోసం వచ్చిన మండలంలోని కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. మిగిలిన పాఠశాలల ఉపాధ్యాయులు కూడా వీటిని తీసుకెళ్లాలని ఎంఈవోలు సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు ఈ పుస్తకంలో ఫార్మాటివ్, సమ్మెటివ్ పరీక్షలు రాయాల్సి ఉందన్నారు. పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు యథావిధిగా రాస్తారన్నారు. మండలంలో 12,691 మంది విద్యార్థులకు సరపడా పుస్తకాలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తోటగరువు హైస్కూల్ హెచ్‌ఎం జి.కె.దుర్గాభవానీ, సీఆర్పీలు, పీడీలు, పీటీ పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ కోసం భెల్ కార్మికుల ఆందోళన



భెల్ గేటువద్ద ఆందోళన చేస్తున్న ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు

గాజువాక: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం భెల్‌లో హయ్యర్ పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. భెల్ మెయిన్ గేటు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు జీటీపీ ప్రకాష్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం భెల్‌లో హయ్యర్ పెన్షన్‌కు సంబంధించిన ఈపీఎఫ్-95ను అమలు చేయాల్సి బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ఉద్యోగుల పెన్షన్ కోసం డేట్ ఆఫ్ జాయినింగ్స్‌ను సరి చేయాలన్నారు. ఈ విషయంలో యాజమాన్యం ఉద్దేశపూర్వకంగానే కాలయాపన చేస్తోందని ఆరోపించారు. హైదరాబాద్ యూనిట్‌లో హయ్యర్ పెన్షన్‌ను అమలు చేస్తూ ఇక్కడ చేయకపోవడంలో యాజమాన్యం నిర్లక్ష్యం ఉందన్నారు. దీనిపై తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, అందులో భాగంగా భెల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు సీతన్న నాయుడు, వి.ఆనందరావు, కె.విజయ్‌కుమార్, మురళీశ్వరరావు, బి.కృష్ణమూర్తి, డి.నర్సింహారావు, డి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

లులుతో ఒప్పందం రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపూర్ ప్రతినిధులు

పెందుర్తి: లులు సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న తప్పుడు ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపూర్ జిల్లా కార్యదర్శి దేవ డిమాండ్ చేశారు. పెందుర్తిలో పలువురు ప్రజా సంఘాల నాయకులతో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా దేవ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 176 వాగ్దానాలను గాలికి వదిలేసి, ప్రభుత్వ స్థలాలను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తోందని ఆక్షేపించారు. ప్రభుత్వ రంగం సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయకుండా కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాయడం సరికాదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తే ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో 'స్వచ్ఛతా అభియాన్'

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్‌లో శుక్రవారం స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమం ప్రారంభమైంది. విశాఖ రైల్వే స్టేషన్‌లో ఈ కార్యక్రమాన్ని డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ప్రారంభించి మాట్లాడారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడం, సమర్థవంతంగా చెత్త తరలించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం స్వచ్ఛతా అభియాన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రైల్వే పరిసర ప్రాంతాలను ప్లాస్టిక్, చెత్త, వ్యర్థాల రహితంగా ఉంచడమే లక్ష్యమన్నారు. అనంతరం రైల్వే ఉద్యోగులు, సిబ్బంది, పారిశుధ్య సేవకులు, ప్రయాణికుల చేత డీఆర్‌ఎం స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 15 వరకు స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమాలు జరుగుతాయని అధికారులు తెలిపారు. వాల్తేర్ డివిజన్‌లోని శ్రీకాకుళం రోడ్, విజయనగరం, రాయగడ, కోరాపుట్, జగదల్‌పూర్, కిరండూల్, అరకు, సింహాచలం, దువ్వాడ రైల్వే స్టేషన్లు, ఎలక్ట్రికల్ లోకోషెడ్, డీజిల్ లోకోషెడ్, కోచ్ కేర్ సెంటర్, ఇతర అన్ని విభాగాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారన్నారు. పర్యావరణం, హౌస్‌కీపింగ్ మేనేజ్‌మెంట్ విభాగం పలు ఆకస్మిక పారిశుధ్య డ్రైవ్‌లు నిర్వహిస్తారని చెప్పారు. ఏడీఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) ఇ.శాంతారం, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్, ఎన్విరాన్‌మెంట్ కం హౌస్‌కీపింగ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రవీణ్ భటి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణ లక్ష్మి పూజలు



పిలకవానిపాలెంలో లక్షీదేవిగా దుర్గమ్మ



కంచరపాలెంలో దుర్గాదేవి



బాపూజీనగర్‌లో అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో మహిళలు భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు.శ్రావణమాసం రెండో శుక్రవారం కావడంతో చింతామణి దుర్గాగణపతి ఆలయంలో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అలాగే 58వ వార్డు పిలకవానిపాలెంలోని నవ దుర్గ ఆలయంలో కొలువుదీరిన దుర్గమ్మను లక్ష్మీదేవిగా అలంకరించి, పది,ఇరవై నోట్లతో అలంకరించారు. 61వ వార్డు మల్కాపురం నగరాలవీధి వద్ద గల పెద్దింటమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ లక్ష్మి పూజలు చేపట్టారు. అలాగే మహిళలు తమ ఇంట్లో లక్ష్మీదేవి రూపాలను నెలకొల్పి పచ్చటి తోరణాలు ఇంటికి కట్టి చామంతి పూలతో అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

కంచరపాలెం: కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ కూడలి, 104 ఏరియాల్లోని ఆలయాల్లో శ్రావణ మాసం రెండో శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. దుర్గానగర్ దుర్గాలయంలో, బాపూజీనగర్ మహాలక్ష్మిదేవి ఆలయంలో, పార్వతీశ్వరాలయంలో వరలక్ష్మీదేవికి ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ, సూర్యప్రకాష్ శర్మ, శ్రీనివాసశర్మ నేతృత్వంలో అభిషేకాలు, పుష్పార్చనలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయాల కమిటీ సభ్యులు, సేవకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


ఎంఈవోలుగా అందరికీ అవకాశమివ్వాలి



డీఈవో ప్రేమకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆరిలోవ : ఎంఈవో 1 పోస్టులకు నియామకాలు చేపట్టేటప్పుడు అన్ని పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం కల్పించాలని పీఆర్‌టీయూ, ఆపస్ సంఘాల ఉపాధ్యాయులు డీఈవో ఎస్.ప్రేమకుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే ఎంఈవో 1గా నియమించడానికి ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను వెనక్కు తీసుకోవాలని కోరారు. ఇది ఉమ్మడి సర్వీస్ రూల్‌కు విఘాతం కల్పించడమేనని తెలిపారు. దీనికి నిరసనగా నల్ల బ్యాడ్జీలతో జిల్లాలోని పాఠశాలల్లో చెక్‌డౌన్ చేపట్టినట్లు తెలిపారు. ఒకే డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు కామన్ సీనియారిటీ ప్రాతిపదికన మండల విద్యాధికారులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్దు శ్రీను, నాగేశ్వరరావు, అరుణ్‌కుమార్, విశ్వనాథ, సన్యాసినాయుడు, సుదర్శన్ పట్నాయక్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం



రైల్వేట్రాక్‌పై లభ్యమైన మృతదేహం

కూర్మన్నపాలెం: రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఎస్టీపీసీ రైల్వేట్రాక్ 7–8 వద్ద మృతదేహాన్ని గమనించామని ఆయన చెప్పారు. ఆ వ్యక్తి వయస్సు 45–50 మధ్య ఉంటుందని, చామనచాయ రంగులో ఉండి ఎరుపు రంగు చొక్కా ధరించాడని ఆయన వివరించారు. అలాగే ఒక కాలు తెగి పడి ఉందని చెప్పారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.